అంగన్వాడీలను వేధిస్తే ఉద్యమిస్తాం



రాయదుర్గం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు



బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయదుర్గం: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లను వేధింపులకు గురిచేస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సీఐటీయూ డివిజన్ జాయింట్ సెక్రెటరీ మల్లికార్జున హెచ్చరించారు. బుధవారం అంగన్వాడీ కోర్కెల దినోత్సవం సందర్భంగా న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచుతామన్న విషయాన్ని గుర్తుచేశారు. దాన్ని నెరవేర్చేలా కృషి చేయాలన్నారు. అలాగే 42 రోజుల సమ్మెకాలంలో ఇచ్చిన మినిట్స్ కాపీలోని అంశాలపై జీఓ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తొమ్మిది డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గుమ్మఘట్టలో..

గుమ్మఘట్ట: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేస్తామన్న హామీలు నెరవేర్చాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ కార్యదర్శి మేరీ, సెక్టార్ నాయకురాళ్లు మల్లక్క, రుద్రమ్మ, చంద్రకళ, రాధిక డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రెవెన్యూ సిబ్బందికి అందచేశారు.

బొమ్మనహాళ్‌లో...

బొమ్మనహాళ్: తమ డిమాండ్లు నెరవేర్చాలని తీర్చాలని కోరుతూ బుధవారం రెవెన్యూ అధికారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందించారు. బుధవారం అఖిల భారత కోరికల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని తహశీల్దార్ కార్యాలయం కోరికల దినోత్సవం సందర్భంగా నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ కార్యాలంలో సబ్ ఆర్డినేటర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం నాయకులు లావణ్య, జడేమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బ్రహ్మసముద్రం: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ ఈశ్వరయ్యకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. బుధవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు తిప్పేరమ్మ, సెక్టార్ కమిటీ సభ్యులు సజాత, అనిత, సత్యవతి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

కుందుర్పి: తమ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీల యూనియన్ సభ్యులు భాగ్యమ్మ, కరియమ్మ తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం కోర్కెల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. గత సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు గంగమ్మ, రాధమ్మ, సువర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

కంబదూరు: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. కోర్కెల దినం సందర్భంగా బుధవారం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ నిత్యానందబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయనిర్మల, సువర్ణమ్మ, కురుబ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ చేయొద్దు

శెట్టూరు: అంగన్‌వాడీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల అన్నారు. బుధవారం కోర్కెల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్లను నెరవేర్చాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్ఐ ఉషశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ద్రాక్షాయిని, అపర్ణ, జానకి, కమలాక్షి, విశాలాక్షి, విమల, కుముదా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మసముద్రంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



కుందుర్పి తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళన



శెట్టూరులో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి సాయం



ప్రధానోపాధ్యాయుడికి నగదు, కుర్చీలను అందజేస్తున్న దాత సుధాకర్

కంబదూరు: నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విదార్థి (1989-90లో పదో తరగతి) అయిన నిహాస్ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ యజమాని సుధాకర్ పాఠశాల అభివృద్ధికి తనవంతుగా రూ.30 వేల నగదు, రూ.10 వేలు విలువ చేసే కుర్చీలను వితరణ చేశారు. బుధవారం వీటిని ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుమూర్తి, సుధాకర్, భువనేంద్ర, సంజీవరెడ్డి, సత్యనారాయణ, లాయర్ ముత్యాలప్ప, ఆర్ఎంపీ అనిల్, పీడీలు ఓబులేసు, సంజీవరాయుడు, పీఈటీ గోవింద్, పాఠశాల కమిటీ చైర్మన్ మారుతి, శివరాం తదితరులు పాల్గొని దాత సుధాకర్‌ను అభినందించారు.

బాధ్యతగా సేవలందించండి



మర్రిమాకులపల్లి సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ శంకర్

కంబదూరు: సచివాలయ సిబ్బంది బాధ్యతగా సేవలందించాలని డీఎల్‌డీఓ శంకర్ సూచించారు. బుధవారం మర్రిమాకులపల్లి సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ప్రతి ఉద్యోగీ సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పండ్ల మొక్కల సాగుకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్

బొమ్మనహాళ్: పండ్ల మొక్కలు సాగు చేసే రైతులను జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులను పండ్ల మొక్కలు సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. మూడేళ్ల పాటు ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ రమేష్, ఈసీ రాజేష్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు బ్రహ్మయ్య, నాగేంద్ర, ఎఫ్ఏ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కదరంపల్లిలో విషజ్వరాలు

కుందుర్పి: కదరంపల్లిలో విషజ్వరాలు వణికిస్తున్నాయి. కుందుర్పి పీహెచ్‌సీలో ముగ్గురు డాక్టర్లు ఉన్నా వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయని జ్వరపీడితులు చెబుతున్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సకాలంలో వైద్యం అందడం లేదని రైతు సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం మోహిత్, పుష్పంత్ అనే చిన్నారులు డెంగీ బారినపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యాధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి జ్వరాలను అదుపులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

జోరుగా ఫాగింగ్



ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణంలో డయేరియా, మలేరియా ప్రబలకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో చౌడేశ్వరీ కాలనీ, శాంతినగర్, పాతమార్కెట్ ప్రాంతాల్లో దోమల నివారణకు విస్తృతంగా ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా ఈఓ గౌస్‌సాహెబ్ ఇంటింటికీ వెళ్లి కలుషిత నీరు తాగరాదన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు.

హంతకులను త్వరలో పట్టుకుంటాం



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

• ఎస్పీ గౌతమిశాలి



మృతుడు గొల్ల ఆదెప్ప (ఫైల్)

రాయదుర్గం: మండల పరిధిలోని మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆదెప్ప హత్య ఘటనపై ఎస్పీ గౌతమిశాలి విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి హత్య జరిగిన ప్రాంతాన్ని కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు, అర్బన్ సీఐ శ్రీనివాసులతో కలసి పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ రాబట్టిన ప్రాథమిక వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ఆదెప్ప హంతకులను వీలైనంత త్వరగా పట్టుకుంటామన్నారు. ఈ కేసులో ఎవరిని వదలకుండా దర్యాప్తును మరింత ముమ్మరం చేయిస్తామన్నారు. నిందితులకు శిక్ష పడేలా తగిన ఆధారాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఎక్కడా ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే రెండు బృందాలను రంగంలోకి దించామని వివరించారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పికెట్ కొనసాగించాలన్నారు.

డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ ఆధారాల సేకరణ

టీడీపీ నాయకుడు ఆదికేశవులు (అలియాస్) ఆదెప్పను దారుణంగా హత్యచేసి పరారైన నిందితులను త్వరలో పట్టుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం అర్బన్ పీఎస్ వద్ద సీఐలు ప్రసాద్‌బాబు, శ్రీనివాసులుతో కలసి డీఎస్పీ విలేకర్లతో మాట్లాడారు.. గ్రామంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన పాత కక్షల కారణంగా మంగళవారం రాత్రి ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో మెచ్చిరి గ్రామానికి ఆనుకుని ఉండే హుచ్చంగి దుర్గం వెళ్లే దారిలో గొల్ల ఆదెప్ప మృతదేహాన్ని రాత్రి 9 గంటల ప్రాంతంలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం చెరవేశారన్నారు. సిబ్బందితో కలసి హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. వెంటనే డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌ను రప్పించి నిందితుల ప్రాథమిక ఆధారాలు గుర్తించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ ఘటనలో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ టీమ్ ఏర్పాటు చేశామన్నారు.

గ్రామంలో పికెట్ ఏర్పాటు

శాంతిభద్రతల దృష్ట్యా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మెచ్చిరి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని డీఎస్పీ బీ శ్రీనివాసులు తెలిపారు. తనతో పాటు గుంతకల్లు డీఎస్పీ, నలుగురు సీఐలు, ఎస్ఐలు, సుమారు 80 మంది పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లోకి తెచ్చామన్నారు.

బంధువుల ఆందోళన

హత్యకు గురైన ఆదెప్ప బంధువులు న్యాయం చేయాలంటూ బుధవారం రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. డీఎస్పీ బీ శ్రీనివాసులు వారికి నచ్చచెప్పి మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. సజావుగా అంత్యక్రియలు పూర్తయ్యేలా కృషి చేశారు. హత్యకు గురైన ఆదెప్ప మృతదేహాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, కాలవ భరత్ పరిశీలించి నివాళులు అర్పించారు.

సర్దుకుపోతేనే సంసారం సుఖమయం



జంటకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం

అనంతపురం సిటీ: సర్దుకుపోతేనే సంసారం సుఖమయం అవుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు లయన్ డా.షేక్ రొఖియా బేగం అన్నారు. బుధవారం నగరంలోని సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అప్పటికే మనస్పర్థలతో వచ్చిన రెండు జంటలకు ఆమె వేర్వేరుగా కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతపురంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఓ జంటను పిలిచి మాట్లాడారు. తొమ్మిదేళ్ల కిందట తమకు వివాహం కాగా.. ఇద్దరు పిల్లలు ఉన్నారని బాధితురాలు తెలిపింది. అయితే తన భర్త తాగుడుకు బానిసై తనను, పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఫిర్యాదు చేసింది. తాగుడు మానకపోతే కలసి ఉండలేనంటూ భార్య తేల్చిచెప్పగా, తండ్రి మొహం చూసేందుకు కూడా అతని పిల్లలు ఆసక్తి చూపలేకపోయారు. పరిస్థితిని గమనించిన కమిషన్ సభ్యురాలు చలించిపోయారు. వ్యసనాలతో జీవితం ఎంత నరకంగా ఉంటుందో వివరించారు. భార్యా బిడ్డలతో హాయిగా సాగిపోవాల్సిన సంసారంలో తాగుడు ఎంత చిచ్చుపెట్టిందో విడమర్చి చెప్పారు. ఆలోచించుకుని రావాల్సిందిగా కాస్త సమయం ఇచ్చారు. తాగుడుకు బానిసై తాను ఇంతకాలం ఏం కోల్పోయానో అర్థమైందంటూ తప్పు ఒప్పుకున్నాడు. జీవితంలో పొరపాటు చేశాని.. తన భార్యా, బిడ్డలకంటే మందు ఎక్కువేం కాదని లెంపలేసుకున్నాడు. ఇక నుంచి భార్యా బిడ్డలను చక్కగా చూసుకుంటానంటూ ప్రమాణం చేశాడు. ఆ తరువాత అనంతపురం తపోవనం ప్రాంతానికి చెందిన అమ్మాయి, తాడిపత్రికి చెందిన అబ్బాయికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పారా లీగల్ ఎ.శ్రీకళ, పారా మెడికల్ పర్సనల్ ఆర్.రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు ముందుండాలి



బహుమతులు అందజేస్తున్న గ్రూప్, క్యాంప్ కమాండర్లు ఎస్.రమేష్, బీఎస్ ప్రసాద్

కూడేరు: ఎన్‌సీసీ క్యాడెట్లు సమాజానికి తమవంతు సేవ చేసేందుకు ముందుండాలని కర్నూలుకు చెందిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ ఎస్.రమేష్ సూచించారు. కూడేరు మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 10 రోజులు పాటు సాగిన సీఏటీసీ-2 ఎన్‌సీసీ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రూప్ కమాండర్ మాట్లాడారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన మీకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. సన్మార్గంలో నడుస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వివిధ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వివిధ గ్రూపుల క్యాడెట్లను అభినందించారు. ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ కల్నల్ బీఎస్ ప్రసాద్, డిప్యూటీ కమాండర్ శశికుమార్, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ అధికారులు, 550 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

ఉరవకొండ: మొక్కలను నాటడమే కాకుండా విద్యార్థినులు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలి. రోజూ నీరు పోస్తూ మొక్కలను కాపాడుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు, మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప సూచించారు. స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీఓ, ఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో విస్తారంగా మొక్కలు నాటాలన్నారు. పచ్చదనం పెంపొందించడం వల్ల సకాలంలో వర్షాలు పడి తాగు, సాగు నీరు పుష్కలంగా అంది భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ

కూడేరు: మండలంలోని 14 పంచాయతీల్లో 2023-24 ఏడాదిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై గురువారం నుంచి సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు రాష్ట్ర రీసోర్స్‌పర్సన్ (ఎస్ఆర్‌పీ) లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీపై ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సామాజిక తనిఖీ అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రీసోర్స్ పర్సన్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సామాజిక తనిఖీ సజావుగా సాగేందుకు సహకారం అందించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పనులను ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పక్కాగా చూపితే తనిఖీ ప్రక్రియ తొందరగా పూర్తివుతుందని తెలియజేశారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులను చూపాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలను గ్రామ సభలు నిర్వహించి అక్కడ వివరిస్తామని పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే సంబంధిత సిబ్బంది ఆధారాలు చూపితే నివేదిక నుంచి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏపీఓ తులసీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

12న 'పూల్ క్యాంపస్ డ్రైవ్'

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 12న పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీ ఆధ్వర్యంలో 'పూల్ క్యాంపస్ డ్రైవ్' నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2023, 2024 సంవత్సరంలో బీబీఏ, బీసీఏ, బీకామ్, బీటెక్, బ్యాచిలర్ డిగ్రీ ఏదైనా ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. బయోడేటాతో ఉదయం 8:30 గంటలకు కళాశాల వద్దకు చేరుకోవాలన్నారు. ఇందులో మొదటి రౌండ్ గ్రూప్ డిస్కషన్ ఆధారంగా, రెండో రౌండ్ వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా ఎన్నిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులు కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతంలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి జీతంతో పాటు వసతి, భోజన సదుపాయం కూడా కల్పిస్తారని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓ గుర్తుతెలియని వ్యక్తి గార్లదిన్నె నుంచి పామిడి వైపు బైక్‌పై వెళ్తుండగా తిమ్మంపేట సమీపంలో డివైడర్ ఢీన్నాడు. తలకు తీవ్రగాయాలైన అతడిని స్థానికులు 108లో అనంతపురము ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయదుర్గం టౌన్: సీజనల్ వ్యాధులైన డెంగీ, డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, వైద్యులు రమేష్, అజహర్‌ఖాన్ పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని భంభంస్వామి లేఅవుట్‌లో బుధవారం వైద్యాధికారులు డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

నేడు తిప్పేపల్లికి మాజీ ఎంపీ రంగయ్య రాక

కంబదూరు: మాజీ ఎంపీ తలారి రంగయ్య గురువారం తిప్పేపల్లికి వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ తెలిపారు. ఎన్నికల తర్వాత టీడీపీ కార్యకర్తల దాడిలో గాయడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహులును మాజీ ఎంపీ పరామర్శించనున్నట్లు వెల్లడించారు.

నారాయణప్ప సేవలు మరువలేనివి



హెచ్‌ఎం నారాయణప్పను సన్మానిస్తున్న గ్రామస్తులు

కుందుర్పి: తూముకుంట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం నారాయణప్ప అందించిన సేవలు మరులేనివని సర్పంచ్ రామాంజినేయులు, ఎంపీటీసీ బసవరాజు తదితరులు కొనియాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా హెచ్‌ఎం దంపతులను పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం సేవలను కొనియాడుతూ.. శేష జీవితం హాయిగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంగాధర, తిమ్మరాజు, సంపత్‌కుమార్, తిప్పేస్వామి, దేవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.9 లక్షలతో పశువైద్యశాల మరమ్మతులు

ఉరవకొండ: స్థానిక ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆవరణలో పూర్తిగా శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల మరమ్మతు పనులను బుధవారం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేశులు పరిశీలించారు. పంచాయతీరాజ్ నిధులు రూ.9 లక్షల వ్యయంతో మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తి కావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలకు మరమ్మతులు చేయించి తిరిగి ప్రజలకు సేవలందించడానికి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



మాట్లాడుతున్న జడ్జి బండే సుబహాన్

కళ్యాణదుర్గం: ద్విచక్రవాహనదారులు ప్రయాణంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జూనియర్ సివిల్ జడ్జి బండే సుబహాన్ సూచించారు. కళ్యాణదుర్గం కోర్టు ఆవరణలో బుధవారం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం జరిగింది. జడ్జి మాట్లాడుతూ కరోనా, ఎయిడ్స్ వంటి రోగాలతో పాటు అధికంగా రోడ్డు ప్రమాదాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు నివారించడానికి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, ఉద్యోగులు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, హరి చక్రవర్తి, మల్లికార్జున, రామాంజినేయులు, దాదా ఖలందర్, దేవేంద్ర, తులసీ నాయక్, రమేష్, మంజునాథ్‌తో పాటు కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.